సంపుటి :03 | సంచిక :45 | పేజీలు :06 | www.aksharadarbar.com

# అక్షర దర్బార్

Voice of the People

వెల ₹5

బుధవారం 25, మార్చి 2026




## బల్దియా బడ్జెట్‌కు ఆమోదం

- రూ. 1040.58 కోట్లతో అభివృద్ధి ప్రణాళిక
- ప్రజలపై పన్నుల భారం లేకుండానే ముసాయిదా రూపకల్పన : మేయర్

02



## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం

04

## కాంగ్రెస్‌కు జీవన్‌రెడ్డి రాజీనామా

- తనకు పదవి ముఖ్యం కాదని ప్రకటన
- ఆత్మగౌరవం కోసమే పార్టీని వీడానని ఉద్ఘాటన
- ఇకపై సీఎం రేవంత్ పైనే పోరాడతానని స్పష్టీకరణ



05

# ఇంధనం.. పుష్కలం

## డోన్ట్ వర్రీ.. వాహనదారులారా!

### పెట్రోల్, డీజిల్ కొరత వదంతులు మాత్రమే

- రాష్ట్రంలో రెండు నెలలకు సరిపడా నిల్వలు
- కొన్ని బంక్‌ల బంద్‌కు కారణముంది !
- సరఫరా సంస్థలు క్రెడిట్ ఎత్తివేయడంతోనే మూత
- వదంతులు నమ్మొద్దని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రకటన

రాష్ట్రంలో ఇంధన నిల్వలు నిండుకున్నాయంటూ సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టిన తప్పుడు వార్తలు మంగళవారం ఒక్కసారిగా కలకలం రేపాయి. పెట్రోల్, డీజిల్ దొరకదనే భయంతో వాహనదారులు బంకుల వద్దకు పోటెత్తడంతో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కొన్నిచోట్ల సరఫరా సంస్థలు క్రెడిట్ పద్ధతిని ఎత్తివేయడం వల్ల యాజమాన్యాలు బంకులను మూసివేయగా, అది కాస్తా కొరత ఉందనే అపోహకు దారితీసింది. సాధారణ వినియోగం కంటే ఒక్కరోజే 25 శాతం అమ్మకాలు పెరగడం 'పానిక్ బయింగ్'కు అద్దం పడుతోంది. అయితే, రాష్ట్రంలో రెండు నెలలకు సరిపడా నిల్వలు ఉన్నాయని, రష్యా నుంచి ముడిచమురు దిగుమతులు భారీగా జరుగుతున్నాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. అనవసర ఆందోళనతో అప్పులు చేసి మరీ ట్యాంకులు ఫుల్ చేయించుకోవద్దని, వదంతులను నమ్మవద్దని అధికార యంత్రాంగం తేల్చిచెప్పింది.

– అక్షరదర్బార్, వరంగల్

02




## సీఎంకు దమ్ముంటే నాపై పోటీ చేయాలి



- రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్
- మరోసారి కాంగ్రెస్‌కు అధికారం రాదని జోస్యం

02

## లాభాల దిశగా కేంద్ర సహకార బ్యాంకు

03

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్
- డీసీసీబీ మహాజన సభ



అక్షర దర్బార్ Voice of the people

# ఇంధనం.. పుష్కలం




- డోన్ట్ వర్రీ.. వాహనదారులారా!
- పెట్రోల్, డీజిల్ కొరత వదంతులు మాత్రమే
- రాష్ట్రంలో రెండు నెలలకు సరిపడా నిల్వలు
- కొన్ని బంక్‌ల బంద్‌కు కారణముంది !
- సరఫరా సంస్థలు క్రెడిట్ ఎత్తివేయడంతోనే మూత
- వదంతులు నమ్మొద్దని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రకటన

**అక్షరదర్బార్, వరంగల్ :**

రాష్ట్రంలో ఇంధన నిల్వలు అయిపోయాయని, బంకులన్నీ మూతపడనున్నాయనే వార్త సోషల్ మీడియాలో దావానలంలా వ్యాపించడంతో మంగళవారం సాయంత్రం కలకలం రేపాయి. దీంతో వాహనదారులు ఒక్కసారిగా బంకుల వద్దకు పోటెత్తారు. చిన్న చిన్న బంకుల్లోకి సైతం వందలాది మంది దూసుకురావడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ క్రమంలో కొందరు వాహనదారులు బంక్ సిబ్బందితో వాగ్వాదానికి దిగడమే కాకుండా బెదిరింపులకు పాల్పడ్డారు. పరిస్థితి చేయి దాటిపోవడంతో చేసేదేమీ లేక బంక్ యాజమాన్యాలు మూసివేశాయి. కొన్ని చోట్ల ఇంధన ట్యాంకర్లు సకాలంలో రాకపోవడం కూడా ఈ ఆందోళనను మరింత పెంచి ఇంధన కొరత ఉందనే తప్పుడు సంకేతాలను ప్రజల్లోకి తీసుకెళ్లింది. హైదరాబాద్‌లోని ప్రధాన కూడళ్లలో ఉన్న పెట్రోల్ బంకుల వద్ద పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. వరంగల్ మహా నగరంలోనూ కొన్ని బంకుల వద్ద కూడా ఇదే పరిస్థితి. ఆఫీసుల నుంచి ఇంటికి వెళ్లేవారు సైతం గంటల తరబడి క్యూలో నిలబడటంతో ప్రధాన రహదారులన్నీ ట్రాఫిక్ జామ్‌లతో స్తంభించిపోయాయి. వాహనదారుల మధ్య వాగ్వాదాలు పెరిగి కొట్టుకునే వరకు వెళ్లడంతో పోలీసులు రంగంలోకి దిగాల్సి వచ్చింది. పరిస్థితిని అదుపు చేయడానికి అనేక బంకుల వద్ద పోలీస్ ప్రొటెక్షన్ ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 500 బంక్‌లు ఉండగా, మెజార్టీ బంకుల వద్ద వాహనాలు బారులు తీరాయి. ఉమ్మడి జిల్లాలో రోజుకు సుమారు 5 లక్షల లీటర్ల ఇంధనం (పెట్రోల్, డీజిల్ కలిపి) అమ్మకాలు జరుగుతుండగా, గడిచిన 24 గంటల్లో అమ్మకాలు 25 శాతం పెరగడం గమనార్హం.

### - క్రెడిట్ ఇవ్వకపోవడంతో..

ఉన్నట్టుండి యాజమాన్యాలు బంక్‌లు మూయడానికి మరో కారణం కూడా ఉంది. గతంలో ఇంధన సరఫరా సంస్థలు యాజమాన్యాలకు క్రెడిట్‌పై ఇంధనం సరఫరా చేసేవి. ఆ ఇంధనం అమ్మకాలు జరుపుకుంటున్న క్రమంలో యజామాన్యాలు ఐదారు రోజుల తర్వాత క్రెడిట్ చెల్లించేవి. అయితే.. తాజాగా సరఫరా సంస్థలు క్రెడిట్ పద్ధతిని ఎత్తివేశాయి. దీంతో యాజమాన్యాలు అప్పటికప్పుడు అడ్వాన్స్ చెల్లించి, ఇంధనం తెప్పించుకోలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో కొన్నిచోట్ల బంక్‌లు మూతపడ్డాయి.

### - అప్పులు చేసి మరీ ఫుల్ ట్యాంకులు

వదంతుల ప్రభావం ఎంతలా ఉందంటే.. చేతిలో డబ్బు లేకపోయినా వాహనదారులు ఆందోళనతో అప్పులు చేసి మరీ పెట్రోల్ పోయించుకుంటున్నారు. డిజిటల్ పేమెంట్స్ సర్వర్లు డౌన్ అవ్వడంతో నగదు కోసం ఏటీఎంల వద్ద కూడా క్యూలైన్లు కనిపించాయి. చాలామంది తమ బైక్‌లు, కార్లను ఫుల్ ట్యాంక్ చేయించుకోవడమే కాకుండా ఇంట్లోని ఇతర వాహనాల కోసం బాటిళ్లలో పెట్రోల్ నింపుకుని తీసుకెళ్లారు. కేవలం ఒక్క రోజులోనే ఇంధన వినియోగం సాధారణం కంటే 25 శాతం పెరగడం ఈ పానిక్ బయింగ్‌కు అద్దం పడుతోంది. పరిస్థితి విషమించడంతో తెలంగాణ ప్రభుత్వం సీరియస్ అయ్యింది. పెట్రోల్ బంకుల వద్ద విధులకు ఆటంకం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. సోషల్ మీడియాపై సైబర్ క్రైమ్ పోలీసులు నిఘా పెట్టారు.

### - రష్యా నుంచి దిగుమతి

**భారతదేశ ఇంధన అవసరాల కోసం కేంద్రం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. వచ్చే నెల డెలివరీ కోసం రష్యా నుంచి సుమారు 6 కోట్ల బ్యారెళ్ల చమురును భారత రిఫైనరీలు కొనుగోలు చేశాయి. ఫిబ్రవరి నెలతో పోలిస్తే ఈ కొనుగోళ్లు రెట్టింపు కంటే ఎక్కువగా ఉన్నాయి. అమెరికా ఇచ్చిన వెసులుబాటును ఉపయోగించుకుంటూ భారత్ తన నిల్వలను పెంచుకుంది. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్ లో ధరలు పెరిగినా దేశీయంగా ఇంధన లభ్యతకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.**


### - అంతా సజావుగానే : డీలర్స్ అసోసియేషన్

**రాష్ట్రవ్యాప్తంగా ఇంధన సరఫరా సజావుగానే సాగుతోందని తెలంగాణ పెట్రోలియం డీజిల్ అసోసియేషన్ ప్రకటించింది. ఆయిల్ కంపెనీల డిపోల వద్ద సరిపడా నిల్వలు ఉన్నాయని తెలిపింది. అంతర్జాతీయ ఉద్రిక్తతల వల్ల సరఫరా ఆగిపోతుందనేది కేవలం ఊహాగానమేనని కొట్టిపారేసింది. అవసరానికి మించి కొనుగోలు చేయడం వల్లే కృత్రిమ కొరత ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. బంకులకు ఇంధన సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని డీలర్లు స్పష్టం చేశారు.**

---

# సీఎంకు దమ్ముంటే నాపై పోటీ చేయాలి

- రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు సవాల్
- మరోసారి కాంగ్రెస్ కు అధికారం రాదని జోస్యం



అక్షరదర్బార్, సిద్దిపేట : సీఎం రేవంత్ రెడ్డికి దమ్ముంటే తనపై పోటీ చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్ విసిరారు. బుధవారం ఆయన ఈ మేరకు సిద్దిపేటలో మాట్లాడారు. రేవంత్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతానని పగటి కలలు కంటున్నారని, ఆయన తల్లకిందులుగా తపస్సు చేసినా అది అసాధ్యమని ఎద్దేవా చేశారు. తమ పార్టీకి ఎప్పుడు, ఎలా గోల్ కొట్టాలో బాగా తెలుసని, సమయం వచ్చినప్పుడు బీఆర్ఎస్ సత్తా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. వేరే వాళ్లను పంపడం కాకుండా, నేరుగా సిద్దిపేటలో తనపై పోటీకి రావాలని రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ సవాల్ విసిరారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో పాటు రైతులను కూడా దారుణంగా మోసం చేసిందని హరీశ్ రావు మండిపడ్డారు. ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైన రేవంత్ సర్కారుపై ఇప్పటికే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని విశ్లేషించారు. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అంశాలను తాము స్వాగతిస్తున్నామని తెలిపారు. పునర్విభజన వల్ల భవిష్యత్తులో బీఆర్ఎస్ పార్టీకే రాజకీయంగా మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన సీనియర్ నేత జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలోకి వస్తారనే ప్రచారంపై ఆసక్తికరంగా స్పందించారు. ఆయన వస్తారా లేదా అనేది ఇప్పుడే చెప్పడం కంటే, వేచి చూస్తేనే బాగుంటుందని వ్యాఖ్యానించారు.

# బల్దియా బడ్జెట్‌కు ఆమోదం

- రూ. 1040.58 కోట్లతో అభివృద్ధి ప్రణాళిక
- ప్రజలపై పన్నుల భారం లేకుండానే ముసాయిదా రూపకల్పన : మేయర్
- కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కమిషనర్‌కు ఘన సన్మానం




**అక్షరదర్బార్, వరంగల్ :**

వరంగల్ మహా నగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.1040 కోట్ల 58 లక్షల 75 వేల అంచనాలతో కూడిన ముసాయిదా బడ్జెట్‌ను గురువారం పాలక వర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన జరిగిన ఈ కౌన్సిల్ సమావేశంలో బల్దియా అకౌంట్స్ అధికారి శివలింగం బడ్జెట్ వివరాలను సభ ముందు ఉంచగా, మెజారిటీ సభ్యులు దీనికి మద్దతు తెలిపారు. మొత్తం రూ.1040.58 కోట్ల బడ్జెట్‌లో వివిధ విభాగాలకు కేటాయింపులు ఇలా ఉన్నాయి. మొత్తం అంచనా వ్యయం రూ.1040.58 కోట్లు. మూలధన వ్యయం (అభివృద్ధి పనులు) రూ.691.40 కోట్లు. చార్జ్డ వ్యయం రూ.204.92 కోట్లు. నిర్వహణ వ్యయం రూ.67.96 కోట్లు. గ్రీన్ బడ్జెట్ (పర్యావరణం) రూ.34.91 కోట్లు. పారిశుధ్య నిర్వహణ రూ.40.75 కోట్లు. సిబ్బంది జీతభత్యాలు రూ.100 కోట్లు. బల్దియాకు సొంత పన్నుల ద్వారా రూ.349.19 కోట్లు, వివిధ ప్రభుత్వ గ్రాంట్ల ద్వారా రూ.685.20 కోట్లు, డిపాజిట్లు, అడ్వాన్సుల ద్వారా రూ.620 కోట్లు వస్తాయని అధికారులు అంచనా వేశారు.

### - సీఎం, పీఎంకు కృతజ్ఞతలు

ఈ సందర్భంగా మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ, ఈ బడ్జెట్ వరంగల్ నగర భవిష్యత్తుకు దిక్సూచి వంటిదని పేర్కొన్నారు. "నగర ప్రజలపై ఎలాంటి అదనపు పన్నుల భారం మోపకుండానే మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చాం. మూడు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ), స్ట్రామ్ వాటర్ డ్రైన్ ప్రాజెక్టుల కోసం రూ.5,725.40 కోట్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, సహకరించిన ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు" అని ఆమె తెలిపారు. హైదరాబాద్ తరహాలో వరంగల్‌ను అభివృద్ధి చేయడమే లక్ష్యమని, ఇప్పటికే రూ.225.53 కోట్లతో నగరంలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఆమె వివరించారు. వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ధర్మసాగర్ రిజర్వాయర్ ద్వారా ముందస్తు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

### - కలెక్టర్ కు ఘన సన్మానం

బల్దియా కమిషనర్‌గా విశిష్ట సేవలు అందించి, ఇటీవల హన్మకొండ జిల్లా కలెక్టర్‌గా పూర్తి బాధ్యతలు చేపట్టిన ఇంచార్జ్ కమిషనర్ చాహత్ బాజ్‌ను మేయర్, డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ మసూద్, కార్పొరేటర్లు శాలువాతో సత్కరించి, మొక్కలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్, బల్దియా కమిషనర్, వివిధ విభాగాల అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# లాభాల దిశగా కేంద్ర సహకార బ్యాంకు

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్
- డీసీసీబీ మహాజన సభ



అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టర్, బ్యాంకు బాధ్యతల ఇన్‌చార్జ్ చాహత్ బాజ్ ఫాయ్ అధ్యక్షతన మహాజనసభ జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకు పరిపాలన నివేదికను, 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వివరాలను మహాజనసభ ముందుంచి ప్రవేశపెట్టినట్లు తెలిపారు. రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలు సభలో ప్రవేశపెట్టి ఆమోదం పొందినట్లు వెల్లడించారు. బ్యాంకు డిపాజిట్ సేకరణ, రుణ వితరణలో నిర్దేశించిన లక్ష్యాలను సాధిస్తూ, లాభాల దిశగా ముందుకు సాగుతున్నదని తెలిపారు. రైతులకు, సహకార సంఘాలకు సమయానికి రుణాలు అందజేసి వ్యవసాయ అభివృద్ధికి బ్యాంకు కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు.

పాక్స్ యాక్సిలరేటరీ కార్యక్రమం కింద నాబార్డ్ సహకారంతో నాలుగు సహకార సంఘాలకు డ్రోన్లు, జనౌషధి కేంద్రాల స్థాపనకు తక్కువ వడ్డీపై రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇదే మార్గంలో ఇతర సంఘాలు కూడా అభివృద్ధి కార్యక్రమాల్లో ముందుకు రావాలని సూచించారు. ఈ సందర్భంగా నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్ చంద్రశేఖర్, రవి మాట్లాడుతూ, పాక్స్ యాక్సిలరేటరీ కార్యక్రమం ద్వారా సహకార సంఘాలను బలోపేతం చేయడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టి రైతులకు మెరుగైన సేవలు అందించడం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమాలను అన్ని సంఘాలు సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా సహకార అధికారులు మాట్లాడుతూ, సహకార సంఘాల అభివృద్ధి కోసం బ్యాంకులు మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారులు సంజీవరెడ్డి, నీరజ, వాల్యానాయక్, కోదండ రాములు, వరలక్ష్మి, రామ్మోహన్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు, తోటపంటల శాఖ, మత్స్యశాఖ అధికారులు, సహకార సంఘాల ప్రతినిధులు, బ్యాంకు ముఖ్య కార్యనిర్వాహక అధికారి వజీర్ సుల్తాన్, ప్రధాన మేనేజర్ ఉష్శ్రీ, ఉప ప్రధాన మేనేజర్ అశోక్, బ్యాంకు ప్రత్యేక విధుల అధికారి విజయ కుమారి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## 28న మొగుళ్లపల్లి సంత వేలం పాట

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో ప్రతి శుక్రవారం నిర్వహించే కూరగాయల సంత వేలం పాటను ఈనెల 25న మొగుళ్ళపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు మొగుళ్ళపల్లి గ్రామ సర్పంచ్ చాట్ల విజయ రవీందర్ పంచాయతీ కార్యదర్శి నరేష్ ఒక ప్రకటనలో తెలిపారు ఆసక్తి గల అభ్యర్థులు వేలం పాటలో పాల్గొనాలని సూచించారు

## స్పీకర్ కు హైకోర్టు నోటీసులు

అక్షరదర్బార్, హైదరాబాద్ : బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని, వారు కేవలం సిట్టింగ్ ఎమ్మెల్యేలుగానే కొనసాగుతున్నారని ఇటీవల అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఇచ్చిన క్లీన్ చిట్‌ను సవాల్ చేస్తూ కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం, స్పీకర్‌తో పాటు ఏడుగురు కీలక ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసింది. ముఖ్యంగా దానం నాగేందర్, కడియం శ్రీహరి, అరికెపూడి గాంధీ, కాలే యాదయ్య, ప్రకాష్ గౌడ్, పోచారం శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, తెల్లం వెంకట్రావుకు ఈ నోటీసులు అందాయి. ఈ వ్యవహారంపై పూర్తి వివరణతో కౌంటర్ దాఖలు చేయాలని కోర్టు వారిని ఆదేశించింది. ఫిరాయించిన ఎమ్మెల్యేలపై తక్షణం అనర్హత వేటు వేయాలని, స్పీకర్ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని బీఆర్ఎస్ నాయకులు గట్టిగా వాదిస్తున్నారు. మరోవైపు, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి కూడా హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై స్పందించిన కోర్టు, దానం నాగేందర్‌తో పాటు స్పీకర్ కార్యాలయానికి నోటీసులు ఇచ్చింది. హైకోర్టు ఈ పిటిషన్లపై తదుపరి విచారణను వచ్చే నెల (ఏప్రిల్) 16కు వాయిదా వేసింది.



విద్యార్థులను అభినందిస్తున్న న్యూవిజన్ యాజమాన్యం



శ్రీవేద నుంచి ఎంపికైన విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో కాకతీయ హై స్కూల్ యాజమాన్యం

# గురుకుల ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

### న్యూ విజన్ ప్రభంజనం

అక్షర దర్బార్, దుగ్గొండి : గిర్నిబావి సమీపంలో ఉన్న న్యూ విజన్ హై స్కూల్ విద్యార్థులు గురుకుల ఎంట్రన్స్ (5వ తరగతి)లో 25 మంది విద్యార్థులకు గానూ 25 మంది విద్యార్థులు సీటు సాధించి ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభంజనం సృష్టించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కరస్పాండెంట్ పోరెడ్డి నరసింహారెడ్డి, ప్రిన్సిపాల్ ఎరుకల మహిపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

### శ్రీ వేద విజయఢంకా

అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండలం పెద్ద కొడపాక గ్రామంలో శ్రీ వేద పాఠశాల మరోసారి అద్భుత ప్రతిభను చాటుకుంది. తెలంగాణ గురుకుల ప్రవేశ పరీక్షలో పాఠశాల నుంచి హాజరైన 10 మంది విద్యార్థులందరూ మొదటి విడతలోనే గురుకులాల్లో సీట్లు సాధించి 100శాతం ఫలితాలను నమోదు చేశారు.ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభపై ఆనందం వ్యక్తం చేసిన పాఠశాల కరస్పాండెంట్ విజయ్, ఇది గురువుల శ్రద్ధ, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకారం ఫలితమని పేర్కొన్నారు. విజయం సాధించిన విద్యార్థులకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.పాఠశాల ఈ విజయంతో విద్యా రంగంలో ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది.

### కాకతీయ విజయదుందుభి

అక్షర దర్బార్ చిట్యాల : తెలంగాణ ప్రభుత్వం విద్యాశాఖ రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలో ప్రవేశాల కు నిర్వహించిన టీజీ సెట్ 2026ఐదవ తరగతిలో ప్రవేశాల ఫలితాలను ప్రకటించగా చిట్యాల మండల కేంద్రంలోని కాకతీయ హై స్కూల్ కు చెందిన 16 మంది విద్యార్థులు మొదటి విడతలో సీట్లు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ మహమ్మద్ రాజ్ మహమ్మద్ తెలిపారు ప్రతి సంవత్సరం పాఠశాల నుండి గురుకుల సెట్ కు ఎంపికవుతున్నట్లు ఆయన తెలిపారు.



## చల్లా పరామర్శ..

అక్షర దర్బార్,పరకాల: పరకాల పట్టణంలోని 12 వ వార్డుకు చెందిన కుమారి బండి చందు(23) మృతిచెందగా విషయం తెలుసుకున్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆమె పార్థీవదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కుటుంబసభ్యులను ఓదారుస్తూ చందు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.భాదిత కుటుంబానికి అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే తెలిపారు.మాజీ ఎమ్మెల్యే వెంట పరామర్శించిన వారిలో ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు,యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా గురు పాదపూజ

అక్షర దర్బార్ చిట్యాల : శ్రీమత్ అచల గురుపీఠ రాజయోగాశ్రమ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం చిట్యాల మండల కేంద్రం ఎలగందుల సుభద్ర వారి గృహము లో శ్రీ దయానంద రాపెల్లి రాజమల్లయ్య గారి అఖండ గురు పాదపూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి ప్రభాత సేవ, మేలుకొలుపులు,గురుగీతా పారాయణం,లఘు పూజ,నగర సంకీర్తన, జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీ భూమానంద బూర్గుల బాబురావు , శ్రీ రామానంద పిల్లలమర్రి రాము రాజయోగి, నిష్కల్మషానంద పోతరాజు చంద్రయ్య, విలక్షణానంద మోతే రాజిరెడ్డి పాల్గొన్నారు.



## నల్లెల్ల అయిలయ్యకు నివాళి..

అక్షర దర్బార్, పరకాల : పరకాల మున్సిపల్ 7వ వార్డు మాజీ కౌన్సిలర్ నల్లెల్ల జ్యోతి అనిల్ కుమార్ తండ్రి కీ.శే. నల్లెల్ల అయిలయ్య సంవత్సరికం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ సోదా రామకృష్ణ పాల్గొని నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన అయిలయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పసుల లావణ్య రమేష్, మాజీ కౌన్సిలర్లు పోరండ్ల సంతోష్, మార్క ఉమా రఘుపతి గౌడ్, ఏకు రాజు, నాయకులు మునిగంటి విష్ణువర్ధన్, దామ అనిల్, కుమార్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.




## కౌన్సిలర్ పూర్ణచారి ఆధ్వర్యంలో చలివేంద్రం

అక్షర దర్బార్,పరకాల : ఎండలు తీవ్రరూపం దాల్చుతున్న వేళ ప్రజలకు ఉపశమనం కలిగించే విధంగా పరకాల పట్టణ 9వ వార్డ్ కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారి చలివేంద్రం ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలిచారు. కూరగాయల మార్కెట్ గల్లీలో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రం ద్వారా ప్రతిరోజూ ప్రజలకు చల్లటి తాగునీరు అందిస్తున్నారు.గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ సేవా కార్యక్రమాన్ని ఈ ఏడాది కూడా స్వంత ఖర్చులతో నిర్వహిస్తున్నట్లు పూర్ణాచారి తెలిపారు. వేసవికాలం పూర్తయ్యే వరకు నిరంతరం కూల్ వాటర్ క్యాన్లతో నీరు అందిస్తామని చెప్పారు.పరకాలతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ఉపయోగపడేలా ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రజల ఆదరణతోనే తాను సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నానని, ప్రజల కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నానని ఆయన స్పష్టం చేశారు.



## అధికారులు తనిఖీలు చేపట్టాలి

అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండలంలో గ్రామాలలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు మరియు వసతి గృహాల సమీప ప్రాంతాల్లో ఉన్న ఐస్క్రీమ్ బండ్లు,చిరు తిండ్ల దుకాణాలు మరియు ఏ ఇతర ఆహార విక్రయ కేంద్రాలపై ఆహార భద్రత అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.విక్రయించే ఆహార పదార్థాల గడువు తేదీలు, నాణ్యత, నిల్వ విధానాలను క్రమం తప్పకుండా పరిశీలించాలని సూచించారు.నాణ్యత లేని లేదా గడువు ముగిసిన ఆహార పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.విద్యార్థుల ఆరోగ్య భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండ సంబంధిత అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించాలని సూచించారు.నాణ్యత లేని లేదా గడువు ముగిసిన ఆహార పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్
- ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం



అక్షరదర్బార్, కాజీపేట: ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడం ఆటో డ్రైవర్ల ప్రధాన బాధ్యత అని, వరంగల్ కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చర్యల్లో భాగంగా 'ఆరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని బుధవారం నుంచి ఈ నెల 31 వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ క్రమంలో కాజీపేట రైల్వే ఆడిటోరియంలో వరంగల్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ వలన జరిగే ప్రమాదాలను నివారించాలని సూచించారు. ప్రయాణికుల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకొని వాహనం నడపాలని, మితిమీరిన ప్రయాణికులను ఎక్కించకూడదని అన్నారు. డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి చర్యలు ప్రమాదాలకు దారితీస్తాయని హెచ్చరించారు. ప్రతి డ్రైవర్ రోడ్డు నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని చెప్పారు. ఈ అవగాహన కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ అధికారులు ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై ముఖ్యమైన సూచనలు అందించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం, జీబ్రా క్రాసింగ్ వద్ద జాగ్రత్తలు తీసుకోవడం, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రతపై తమ బాధ్యత ను గుర్తించి, నిబంధనలు పాటిస్తామని ప్రమా ణం చేశారు. కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీ పీ దార కవిత, ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, ట్రాఫిక్, కాజీపేట ఏసీపీలు సత్యనారాయణ, ప్రశాంత్ రెడ్డి, ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్లు వెంకన్న, సీతారెడ్డి, సుజాతతో పాటు కాజీపేట ఇన్ స్పెక్టర్ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.




## ఘనంగా ఎన్జీసీ కార్యక్రమాలు

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేషనల్ గ్రీన్ కార్ప్స (NGC) ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమాలు ఘనంగా ముగిశాయి. ఇందులో భాగంగా "మిల్లెట్స్ & సలాడ్స్ వర్క్షాప్" మరియు సీడ్ బాల్ తయారీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినట్లు ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు భాగ్యశ్రీ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల NGC కోఆర్డినేటర్ ఎం. రాజు విద్యార్థులకు పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించారు. ముఖ్యంగా సిరిధాన్యాలు (మిల్లెట్స్) వినియోగం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు వివిధ రకాల సలాడ్స్ తయారీ నేర్చుకుని, ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లను అలవరుచుకోవాలని సూచించారు. అలాగే పర్యావరణ పరిరక్షణలో భాగంగా సీడ్ బాల్స్ తయారీ కార్యక్రమం నిర్వహించారు. మొక్కల పెంపకం అవసరాన్ని వివరించడంతో పాటు, విద్యార్థులు విత్తనాలను మట్టితో కలిపి సీడ్ బాల్స్ తయారు చేశారు. ఈ సీడ్ బాల్స్‌ను ఖాళీ ప్రదేశాల్లో నాటి పర్యావరణ సంరక్షణకు తమ వంతు సహకారం అందించేందుకు సిద్ధమయ్యారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకన్న, సురేందర్, కళ్యాణి, అనిల్ కుమార్, కుమారస్వామి, ప్రవీణ్, లలిత, పద్మ, విజయభాస్కర్ పాల్గొన్నారు. అలాగే ఎన్సీసీ అధికారి రాజయ్య, శ్రీకళ, మజార్ మరియు ఎన్సీసీ విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మక్క సీడ్ కంపెనీపై చర్యలు తీసుకోవాలి

**బిజెపి మండల అధ్యక్షులు బుర్ర వెంకటేష్ గౌడ్**



అక్షర దర్బార్, చిట్యాల: మేలు రకమైన మక్క సీడ్ అని రైతులకు అంటగట్టి ఇప్పుడు మక్కలను కొనకుండా రైతులను ఇబ్బంది పెడుతున్న సీడ్ కంపెనీ యజమానులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బిజెపి మండల పార్టీ అధ్యక్షులు బుర్ర వెంకటేష్ గౌడ్ డిమాండ్ చేశారు. సీడ్ యజమానులు మక్కలను కొనుకుంటే ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. బుధవారం బిజెపి నాయకులతో కలిసి ఆయా మక్క చేనులను పరిశీలించిన అనంతరం వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ మండలం లోని ఏలేటి రామయ్య పల్లి గ్రామానికి చెందిన రైతులకు మక్క సీడ్ యజమానులు దిగుబడి బాగా వస్తదని 50 మందికి నమ్మబలికి 30 ఎకరాలలో మక్క సీడ్ వేయించారని తెలిపారు. కోత కోసే సమయంలో మాకు సంబంధం లేదని సిడ్ యజమానులు చేతులెత్తేయడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు ఆవేదన చెందుతున్నారని వెంకటేష్ అన్నారు. క్వింటా కు 3200 రూపాయలు చెల్లిస్తామనిరైతులకు రాసిచ్చిన బాండ్ల ప్రకారంగా రైతు పండించిన పంటను కొనుగోలు చేసి రైతులకు వెంటనే డబ్బులు అందజేయాలని లేనిపక్షంలో బిజెపి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని బుర్ర వెంకటేష్ గౌడ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోడారి అశోక్. రైతులు కాశిరెడ్డి తిరుపతి రెడ్డి. రమాకాంత్ రెడ్డి. కనుకుల జగన్ ,కనుకుల మహిపాల్ శీను రైతులు పాల్గొన్నారు.

## డీజిల్, పెట్రోల్ కొరత లేదు

**- ఎస్సై ముప్పు సురేష్**




అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి మండలంలో డీజిల్ పెట్రోల్ కు ఎలాంటి కొరతలేదని కొంతమంది సామాజిక మాధ్యమాలలో డీజిల్ పెట్రోల్ కొరత ఉన్నట్లు తప్పుడు సమాచారం చేస్తున్నారని అలాంటి సమాచారాన్ని ప్రజలు నమ్మవద్దని మొగుళ్ళపల్లి ఎస్సై ముప్పు సురేష్ తెలిపారు బుధవారం ఆయన మొగుళ్ళపల్లి పోలీస్ స్టేషన్లో విలేకరులతో మాట్లాడుతూ.. డీజిల్ పెట్రోల్ పై అసత్య ప్రచారాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు,

# కన్నతల్లిని చంపి.. ఇంట్లోనే పాతిపెట్టి

- ఏడాది తర్వాత మృతదేహం వెలికితీత
- హైదరాబాద్ అల్వాల్ లో వెలుగు చూసిన ఘటన



అక్షరదర్బార్, హైదరాబాద్ : హైదరాబాద్‌లోని అల్వాల్ ప్రాంతంలో వెలుగుచూసిన ఒక దారుణ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. కన్నతల్లిని కూతురు తన భర్తతో కలిసి హత్య చేసి, ఆపై ఎవరికీ అనుమానం రాకుండా ఇంట్లోనే పాతిపెట్టిన ఉదంతం ఏడాది తర్వాత బయటపడింది. పోలీసులు జరిపిన లోతైన విచారణలో నిందితులు చేసిన ఘోరం వెలుగులోకి వచ్చింది. అంజు అనే మహిళ ఆచూకీ ఏడాది నుంచి తెలియడం లేదు. అప్పట్లో ఆమె కనిపించడం లేదని పెద్ద కూతురు పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే, అంజుతో పాటే ఉంటున్న చిన్న కూతురు, అల్లుడు మాత్రం ఆమె ఎక్కడికో వెళ్ళిపోయిందని కట్టుకథలు చెబుతూ వచ్చారు. పోలీసుల విచారణను సైతం తప్పుదారి పట్టించేలా ప్రవర్తించారు. తమకు ఏమీ తెలియనట్టుగా నటిస్తూ ఇన్నాళ్లూ అదే ఇంట్లో కాలం గడిపారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసును పోలీసులు ఇటీవల మళ్ళీ లోతుగా పరిశీలించారు.

### - ఏడాది తర్వాత వెలుగులోకి..

చిన్న కూతురు, అల్లుడి మాటల్లో పొంతన లేకపోవడాన్ని గమనించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించారు. విచారణ తీవ్రతరం చేయడంతో నిందితులు అసలు నిజం చెప్పేశారు. కుటుంబ విభేదాల కారణంగా అంజును హత్య చేశామని, ఆ తర్వాత మృతదేహాన్ని ఎవరికీ తెలియకుండా ఇంటి ప్రాంగణంలోనే గొయ్యి తీసి పాతిపెట్టామని ఒప్పుకున్నారు. నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు వెంటనే క్షేత్రస్థాయికి చేరుకున్నారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో ఇంటి ప్రాంగణంలో తవ్వకాలు చేపట్టి, అంజు మృతదేహాన్ని వెలికితీశారు. ఏడాది కాలం కావడంతో మృతదేహం అస్థిపంజరంగా మారింది. కన్నతల్లిని అంత దారుణంగా అంతమొందించి, ఆమె సమాధిపైనే తిరుగుతూ కాలం గడపడంపై స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# 'తెలంగాణ ప్రజా జాగృతి'కి శ్రీకారం

- శ్రీరామనవమి పర్వదినాన కవిత ప్రకటన
- రేపు అధికారికంగా ప్రకటించే అవకాశం




అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో మరో కొత్త పార్టీ వచ్చి చేరనుంది. మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన సొంత రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించేందుకు ముహూర్తం ఖరారు చేశారు. రేపు.. అనగా గురువారం శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆమె కొత్త పార్టీని ప్రకటించబోతున్నారు. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో పెను సంచలనంగా మారింది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలిగా దశాబ్ద కాలానికి పైగా సామాజిక, సాంస్కృతిక రంగాల్లో పనిచేసిన కవిత, ఇప్పుడు తన రాజకీయ పంథాను మార్చుకుంటున్నారు. తన నూతన పార్టీకి 'తెలంగాణ ప్రజా జాగృతి' అనే పేరును ఖరారు చేశారు. ఈ పార్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం వద్ద కొనసాగుతోంది. దీనిపై ఢిల్లీ హైకోర్టులో జరిగిన విచారణ కూడా తుది దశకు చేరుకున్నట్లు సమాచారం. ఈ నెల 27న ఉదయం 8 గంటలకు ఆమె అధికారికంగా పార్టీ పేరును ప్రకటించనున్నారు. తన రాజకీయ అస్థిత్వానికి వేదికైన నిజామాబాద్ (మెట్టినిల్లు) నుంచే పార్టీ జెండా, గుర్తు మరియు విధివిధానాలను వెల్లడించే అవకాశం ఉంది. గాంధీజీ ప్రతిపాదించిన సర్వోదయ సిద్ధాంతం ప్రాతిపదికన, సామాజిక తెలంగాణే లక్ష్యంగా ఈ పార్టీ పనిచేస్తుందని ఆమె సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణ ఉద్యమకారులకు, యువతకు పార్టీలో అత్యంత ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. కొత్త పార్టీ ప్రకటనతో పాటు, రాబోయే ఎన్నికల్లో కవిత ఎక్కడి నుంచి పోటీ చేయబోతున్నారనే అంశంపై కూడా అదే రోజు స్పష్టత వచ్చే అవకాశం ఉంది. బీఆర్ఎస్ పార్టీలో కీలక నేతగా ఉన్న ఆమె, ఇప్పుడు సొంత కుంపటి పెట్టడం వెనుక ఉన్న రాజకీయ సమీకరణాలపై సర్వత్రా చర్చ జరుగుతోంది. కుటుంబ రాజకీయాల నుంచి బయటకు వచ్చి స్వతంత్రంగా తన బలాన్ని నిరూపించుకోవాలనే పట్టుదలతో ఆమె ఉన్నట్లు కనిపిస్తోంది.

# రైతుల పక్షపాతి రేవంత్ ప్రభుత్వం

### - అసెంబ్లీలో ఎమ్మెల్యే గండ్ర



అక్షరదర్బార్, భూపాలపల్లి: రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతు పక్షపాతిగా పనిచేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం శాసనసభ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. రైతు అంటే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటే రైతు అన్న విధంగా ప్రభుత్వం పని చేస్తుందని పేర్కొన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధరతో పాటు, సన్న వడ్లకు రూ.500 బోనస్, రైతు రుణమాఫీ, రైతు భరోసా కూడా ప్రభుత్వం ఇచ్చిందని అన్నారు. గత ప్రభుత్వం సమయంలో వర్షాలు వచ్చి చెరువులు, కుంటలు తెగినా కూడా కనీసం మరమ్మత్తులు చేయకుండా, భూపాలపల్లి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా మోసం చేసిందని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులకు సబ్సిడీ కింద విత్తనాలు, వ్యవసాయ పరికరాలు పంపిణీ చేసిందని, మహిళా సంఘాలకు ధాన్యం కొనుగోలు కేంద్రాలే కాకుండా సోలార్ ప్లాంట్లు, ఆర్టీసీ బస్సులు, ఇందిరమ్మ క్యాంటీన్ల నిర్వహణ కూడా మహిళా సంఘాలకు ఇచ్చిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు.



# కాంగ్రెస్ కు జీవన్ రెడ్డి రాజీనామా

- తనకు పదవి ముఖ్యం కాదని ప్రకటన
- ఆత్మగౌరవం కోసమే పార్టీని వీడానని ఉద్ఘాటన
- ఇకపై సీఎం రేవంత్ పైనే పోరాడతానని స్పష్టీకరణ

అక్షరదర్బార్, జగిత్యాల : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, శాసనమండలి సభ్యుడు జీవన్‌రెడ్డి బుధవారం పార్టీకి రాజీనామా చేశారు. సుమారు 42 ఏళ్ల పాటు కాంగ్రెస్ పార్టీకి వెన్నెముకలా నిలిచిన ఆయన, గిత్యాలలో తన అనుచరులతో సమావేశమై ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడిన జీవన్ రెడ్డి, పార్టీలో తనకు జరిగిన అవమానాలను ఏకరువు పెట్టారు. పార్టీలో గత రెండేళ్లుగా తాను తీవ్ర అగౌరవానికి గురయ్యానని జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తల కష్టార్జితంతోనే రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రి అయ్యే అవకాశం వచ్చిందని, కానీ అదే కార్యకర్తలకు నేడు రక్షణ కరువైందని మండిపడ్డారు. పార్టీలోని పరిస్థితులపై గత ఏడాది అక్టోబర్‌లోనే అధిష్ఠానానికి లేఖ రాసినా ఫలితం లేకపోయిందని, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు తన రాజీనామా లేఖను పంపుతున్నట్లు ఆయన వెల్లడించారు. తనకు అత్యంత సన్నిహితుడైన కాంగ్రెస్ కార్యకర్త గంగారెడ్డిని నడిబజారులో కిరాతకంగా చంపిన ఘటన జీవన్ రెడ్డిని తీవ్రంగా కలచివేసింది. "ఒక కార్యకర్త దారుణంగా చనిపోతే ముఖ్యమంత్రి నుంచి కనీస పరామర్శ లేదా ఓదార్పు లేదు. ఆ కుటుంబానికి భరోసా కల్పించలేని స్థితిలో ప్రభుత్వం ఉంది" అని ఆయన ధ్వజమెత్తారు. ఒక ఎమ్మెల్సీగా ఉండి కూడా న్యాయం కోసం తాను రోడ్డెక్కాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమని పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఇచ్చిన హామీలు నీటి మూటలయ్యాయని జీవన్ రెడ్డి విమర్శించారు. "నాకు పోరాటం కొత్త కాదు.. ఇకపై రేవంత్ రెడ్డిపైనే నా పోరాటం సాగుతుంది" అని ఆయన సవాల్ విసిరారు. కార్యకర్తలు, అనుచరుల అండతోనే ఇన్నాళ్లూ రాజకీయాల్లో కొనసాగానని, వారి అభిప్రాయం మేరకే ఈ నిర్ణయం తీసుకున్నానని తెలిపారు.

### - బీఆర్ఎస్ వైపు చూపు?

ఇటీవల మాజీ మంత్రి హరీశ్ రావు సైతం జీవన్ రెడ్డి పార్టీ మార్పుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో, ఆయన తదుపరి అడుగు ఎటువైపు ఉంటుందనేది ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. 42 ఏళ్ల అనుబంధాన్ని తెంచుకున్న ఆయన, రేవంత్ సర్కారుకు ఎలాంటి సవాళ్లు విసరనున్నారో వేచి చూడాలి.

# ప్రతిష్ఠాత్మకంగా ప్లాటినం జూబ్లీ వేడుకలు

### - పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు ఈవీ శ్రీనివాస్ రావు




అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల స్థాపనకు 70 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ప్లాటినం జూబ్లీ వేడుకలను ఈ నెల 29న ఘనంగా నిర్వహిస్తున్నట్లు కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు ఇవీ శ్రీనివాస్ రావు తెలిపారు. బుధవారం వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 1955 సంవత్సరం నుంచి ప్రస్తుత విద్యార్థుల వరకు 70 సంవత్సరాల కాలానికి చెందిన పూర్వ విద్యార్థులను ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఆత్మీయ సమ్మేళనంగా ఈ ప్లాటినం జూబ్లీ వేడుకలు నిర్వహించబడుతున్నాయని పేర్కొన్నారు. ఈ వేడుకలు పూర్వ విద్యార్థులందరికీ చిరస్మరణీయంగా నిలిచే విధంగా, కన్నుల పండుగలా జరుగనున్నాయని తెలిపారు. కళాశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులు దేశ విదేశాలలో వివిధ ఉన్నత స్థానాల్లో స్థిరపడి కళాశాలకు గౌరవం తీసుకువచ్చారని అన్నారు. ప్రస్తుతం కళాశాల నూతన భవన నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని, అందరికీ అనుబంధమైన పాత కళాశాల భవనం వచ్చే 5 సంవత్సరాల నాటికి అందుబాటులో వుండదని ఆ నేపథ్యంలో, ఆనాటి తరగతి గదులు, స్నేహాలు, అనుభవాలను మరోసారి స్మరించుకునే అరుదైన అవకాశంగా ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని పూర్వ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ వేడుకల ద్వారా పూర్వ విద్యార్థుల మధ్య అనుబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, భవిష్యత్ తరాల విద్యార్థులకు మార్గదర్శకంగా నిలిచే విధంగా కార్యక్రమాలు రూపొందించామని తెలిపారు. రాష్ట్రం నలుమూలలతో పాటు దేశ విదేశాల నుండి కూడా పెద్ద సంఖ్యలో పూర్వ విద్యార్థులు హాజరవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులందరూ హాజరై ఈ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి మేకల అక్షయ్ కుమార్, కోశాధికారి ఆనంద్ కుమార్, మహిళా కార్యదర్శి జయశ్రీ, ఉపాధ్యక్షులు సతీష్ రెడ్డి, ఈ శ్రీనివాస్ రావు, మహేందర్, దొడ్డిపల్లి కుమార్, బాల్నే భావన రిషి, గన్ను సురేందర్, శశి, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.

వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

## ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915